# అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయం



మెట్‌పల్లిలోని పోలీస్‌స్టేషన్ వద్ద సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

- ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు
- మెట్‌పల్లిలో రూ.10కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- కోరుట్ల మండల పరిషత్ కార్యాలయంలో బతుకమ్మ చీరెల పంపిణీ

మారుతీనగర్, అక్టోబర్ 5: అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లోని అంతర్గత రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి రూ.10 కోట్లతో అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, వార్డు కౌన్సిలర్లతో కలిసి భూమిపూజ, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో పట్టణాభివృద్ధికి మంజూరు చేసిన నిధులతో పట్టణంలోని అన్ని వార్డుల్లో అంతర్గత రోడ్లు, మురుగు కాల్వలను నిర్మించి, ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తున్నామని అన్నారు. కాగా ఆయా వార్డుల కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### ఆడబిడ్డలకు కానుకగా బతుకమ్మ చీరెలు

కోరుట్ల రూరల్, అక్టోబర్ 4 : తెలంగాణ ఆడబిడ్డలకు ముఖ్యమంత్రి కేసీఆర్ బతుకమ్మ పండుగకు కానుకగా చీరెలను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మహిళలకు బతుకమ్మ చీరెలతో పాటు క్రీడాకారులకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2018 వరకు పీఎఫ్ ఉన్న వారికి దసరా కానుకగా సీఎం కేసీఆర్ పెన్షన్లను ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హులందరికీ గృహలక్ష్మి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ మహిళల కోసం అనే సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే ప్రతి గ్రామంలో క్రీడామైదానాలను నిర్మించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, జడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, వైస్ ఎంపీపీ చీటి స్వరూప, జిల్లా సర్పంచుల ఫోరం గౌరవాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావ్, మండల కో–ఆప్షన్ సభ్యులు, ఇన్‌చార్జి ఎంపీడీవో ఎక్కలదేవి శ్రీనివాస్, ఎంపీవో నీరజ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌వీలో ఘనంగా స్వాగతోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

జగిత్యాల, అక్టోబర్ 4: జిల్లా కేంద్రంలోని ఎన్ఎస్‌వీ మహిళా డిగ్రీ కళాశాల సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే వేడుకలు ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల కరస్పాండెంట్ యాద రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు సోషల్ మీడియా, ఇంటర్నెట్‌ను సరిగా ఉపయోగించుకోవాలని వాటిద్వారా ప్రపంచ జ్ఞానాన్ని నేర్చుకొని విద్యలో ఉన్నతంగా రాణించి తల్లిదండ్రులు, గురువులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ శ్రీపాద నరేశ్ మాట్లాడుతూ, విద్యార్థులు రాజకీయంగా కూడా ముందుకు రావాలని సూచించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఎన్ఎస్‌వీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, ఎన్ఎస్‌వీ కో ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ మునీందర్ రెడ్డి, ఆర్‌కే కళాశాల ప్రిన్సిపాల్ రాజేందర్, ఆర్‌కే పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట రమేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- కొడిమ్యాలలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడలు ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కొడిమ్యాల, అక్టోబర్ 4: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శారీరక, మానసిక దృఢత్వానికి ఉపయోగపడుతాయని చెప్పారు. కొడిమ్యాలలో బుధవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పాఠశాల స్థాయి అండర్ –17 పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొడిమ్యాలలో మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు మండల స్థాయి నుంచే జిల్లా, జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సింగిల్ విండో చైర్మన్ పొలు రాజేందర్, సర్పంచ్ ఏలేటి మమతానర్సింహరెడ్డి, వైస్ ఎంపీపీ ప్రసాద్, ఎంపీటీసీ లక్ష్మణ్, జగన్‌మోహన్‌రెడ్డి, కో– ఆప్షన్ సభ్యుడు నసీరుద్దిన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వేంకటేశం, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ లక్ష్మీరాంనాయక్, చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయురాలు విజేయంద్రియ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## లక్కీడ్రా స్కీం నిర్వాహకుడు అరెస్ట్

మేడిపల్లి, అక్టోబర్ 04 : మోటర్ సైకిల్ లక్కీ డ్రా స్కీం నిర్వాహకుడు ప్రతాప్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చిరంజీవి బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి పట్టణానికి చెందిన గోనె ప్రతాప్ మోటర్ సైకిల్ లక్కీ డ్రా స్కీం కింద మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో రైతుల నుంచి డబ్బులు తీసుకొని మోసం చేశాడు. భీమారం మండల కేంద్రానికి చెందిన చెక్కపెల్లి రఘు, దాసరి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ప్రతాప్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ



మత్స్యకారులకు చేప పిల్లలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, నాయకులు

కోరుట్ల రూరల్, అక్టోబర్ 4: మండలంలోని 15 గ్రామాల మత్స్యకారులకు మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ తోట నారాయణ, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్ చేపపిల్లలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేపపిల్లలను పంపిణీ చేస్తున్నదన్నారు. గ్రామాల్లోని కుంటల్లో 1.50 లక్షల చేప పిల్లలను ఉచితంగా మత్స్యకారులకు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎక్కల్‌దేవి శ్రీనివాస్, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ ఖయ్యూం, సర్పంచులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

## గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్ట్

రుద్రంగి, అక్టోబర్ 4: గంజాయి సేవిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, రుద్రంగి పోలీసులు బుధవా రం తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన గడ్డం మనోహర్, కథలాపూర్ మండలం చింతకుంటకు చెందిన వేముల వివేక్, పోసానిపేటకు చెందిన దానవేణి వివేక్ గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి రుద్రంగిలోని గడ్డం మనోహర్ రేకుల షెడ్డులో సేవిస్తుండగా ఎస్ఐ రాజేశ్ సిబ్బందితో కలిసి వారిని పట్టుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. గడ్డం మనోహర్, వేముల వివేక్, దానవేని వివేక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గంజాయిని వివిధ రూపాలలో అక్రమంగా రవాణా చేస్తున్నందున యువత సులువుగా గంజాయికి అలవాటు పడి వారి జీవితాలు నాశనం చేసుకు నే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉంటూ తమ పిల్లలను గమనిస్తూ ఉండాన్నారు. గంజాయి రవాణా చేసినా, సేవించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నిధుల మంజూరు పత్రాల అందజేత



ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జడ్పీ చైర్‌పర్సన్

జగిత్యాల, అక్టోబర్ 4: రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలోని శివాలయం అభివృద్ధి పనులకు మంజూరైన రూ.5 లక్షలు, గ్రామ శాలీవాహన సంఘ అభివృద్ధి పనులకు మంజూరైన రూ.2.5 లక్షల నిధుల ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత నాయకులు, సంఘం సభ్యులకు అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ రమణ ఇంట్లో బుధవారం ప్రొసీడింగ్ పత్రాలను అందించారు. కార్యక్రమంలో గ్రామ ఎంపీటీసీ మోర విజయలక్ష్మి–వెంకటేశ్, గ్రామ అధ్యక్షుడు రత్నాకర్ రావు, నాయకులు ఎంబారి వెంకటేశ్, సతీశ్, లక్ష్మి నర్సయ్య, నడిపన్న, బక్కన్న, శేఖర్, రెడ్డి, గంగశేఖర్, శ్రీనివాస్, వేణు, నరేశ్, చిన్నన్న, కుమ్మరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ఏర్పాట్లపై అవగాహన కలిగి ఉండాలి

అడిషనల్ కలెక్టర్ దివాకర



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దివాకర

ధర్మపురి, అక్టోబర్ 4: రాబోయే అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ దివాకర అధికారులను ఆదేశించారు. బుధవారం ధర్మపురి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి తహసీల్దార్లు, పోలీస్ అధికారులు, ఎంపీడీవోలు, ఇతర ఎన్నికల సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈసారి పోలింగ్ స్టేషన్లు గతంలో కంటే ఎక్కువగా పెరిగాయన్నారు. ఎలాంటి లోటు పాట్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా, సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీ వెంటకస్వామి, ధర్మపురి తహసీల్దార్ కృష్ణచైతన్య, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఐటీఐలో అడ్మిషన్లు

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 4: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో వాన్ ఇన్ పద్ధతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సిరిసిల్ల ప్రభుత్వ ఐటీఐ కళశాల ప్రిన్సిపల్ కనకయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023–24/25 సంవత్సరానికి గానూ ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో (https://iti.telangana.gov) రిజిష్టర్ చేసుకొని, కళాశాలలో ఆప్షన్ పెట్టుకుని ఈ నెల 8లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐ సిరిసిల్ల కళాశాలలో ఎలక్ట్రిషన్, ఫిట్టర్, మెకానిక్ వెహికిల్, వెల్డర్, మెకానిక్ డీజీల్ ట్రేడ్స్‌లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. సర్టిఫికెట్లతో ఈ నెల 9న హాజరు కావాలని సూచించారు.

## అంజన్న హుండీ ఆదాయం రూ.56.78 లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న అధికారులు, నాయకులు

కొడిమ్యాల(మల్యాల), అక్టోబర్ 4: కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ హుండీ లెక్కింపును బుధవారం నిర్వహించారు. 26 రోజులకు గానూ హుండీ లెక్కించగా రూ.56.78 లక్షల నగదు, 14 గ్రాముల మిశ్రమ బంగారం, కిలో 700 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. విదేశీ కరెన్సీ 15 నోట్లు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ధర్మకర్తలు ఒల్లాల లింగాగౌడ్, ఈవో వెంకటేశం, ఏఈవో బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్ సునీల్, శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ల అందజేత

పెగడపల్లి, అక్టోబర్ 4: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం 26 జట్లకు సీఎం కేసీఆర్ స్పోర్ట్స్ కిట్టను ఎంపీపీ గోలి శోభ, జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్‌రావు అందజేశారు. యువత చెడు వ్యసనాలు అలవర్చుకోకుండా క్రీడల్లో రాణించాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుల్లయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూర్, అక్టోబర్ 4: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం 30 జట్లకు సీఎం కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను ఎంపీపీ లక్ష్మి, జడ్పీటీసీ సుధారాణి లు అందజేశారు. రూ.50వేల విలువైన క్రికెట్ కిట్, వాలీబాల్ కిట్, జిమ్ పరికరాలు, టెన్నికాయిట్ మొదలగు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు తదితరులున్నారు.